క్లుప్తంగా

ఉత్సాహంగా తిరంగా యాత్ర



నత్తారామేశ్వరంలో మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం.

పెనుమంట్ర: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా గురువారం ఆచంట నియోజకవర్గంలో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఈ ర్యాలీని పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం నుంచి ప్రారంభించి ఆచంట మండలం కోడేరు వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా రామేశ్వరం సెంటర్‌లో జరిగిన ప్రారంభ సభలో ముందుకుగా మాజీ సైనికులు చిట్టూరి సత్యనారాయణ, బాలం రమేష్, దారపురెడ్డి నాగచంద్రం, జగదీష్‌కుమార్, మన్నె రమేష్‌లను వేదికపై ఘనంగా సత్కరించారు. అలాగే ర్యాలీ మధ్యలో వెలగలేరు నుంచి మార్టేరు సెంటర్ వరకు పాదయాత్ర చేస్తూ సెంటర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

టాటాతో సంసిద్ధ్ స్కూల్ ఎంఓయూ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

నరసాపురం రూరల్: విద్యార్థులకు విలువతో కూడిన విద్యను అందిస్తున్న సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ రతన్ టాటా సంస్థతో ఒప్పందం చేసుకోవడం శుభపరిణామమని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక వాసవి అప్పన ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో టాటా క్లాస్ ఎడ్జ్‌తో సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఒప్పందం చేసుకుందని సీఈఓ ఇందు షానో తెలిపారు. అనంతరం ఇటీవ విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వెంకటరమణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ మెట్ల సురేష్, అడ్మిన్ మేనేజర్ నారాయణ బాబు, శ్రీదేవి, సుధీర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి యూటీఎఫ్ ఉపాధ్యాయుల అభినందన



ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ అభినందనలు తెలుపుతున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

యలమంచిలి: నూతనంగా ఎంపీపీగా ఎన్నికైన ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్‌ను గురువారం యూటీఎఫ్ ఆఫీస్ బేరర్స్ బృందం కలిసి అభినందనలు తెలిపింది. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఆమెను కలిసి అభినందనలు తెలిపిన వారిలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, సంఘ మండలం అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు దంగేటి గోపాలకృష్ణ, మత్తే శరత్‌బాబు, ముద్దల బాపిరాజు, మండపాక రాంబాబు, అడబాల వెంకటేశ్వరరావు, పిండి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆంజనేయ స్వామికి వెండి తొడుగు సమర్పణ



వెండి తొడుగు భక్తులకు చూపుతున్న చిదంబరం

నరసాపురం: ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, పట్టణంలోని 31వవార్డుకు చెందిన కలిగినీడి చిదంబరం గురువారం వార్డులో నిర్వహించిన హనుమద్ జయంతి వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి రూ 3.50 లక్షలు విలువ చేసే 3 కిలోల వెండి తొడుగు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వెండి తొడుగు అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో బళ్ల వెంకటేశ్వరరావు, పాలూరి బాబ్జి, గునిశెట్టి సత్యనారాయణ, గునిశెట్టి శ్రీను, బళ్ల రమేష్, పాలూరి ప్రసాద్, నిప్పులేటి శ్రీను పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

ఉండి: స్పెషల్ ప్రాథమిక పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష ఏపీసీ శ్యామ్‌సుందర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరానికిగానూ అందుబాటులో ఉన్న విద్యా సామగ్రి కిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం భవితా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన కేంద్రం నిర్వహిస్తున్న పాఠశాల భవనం రిపేర్లకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు.

ఆర్‌ఎస్‌కేల్లో కియోస్క్‌ల సేవలు నిల్

- సాఫ్ట్‌వేర్ సమస్యతో మూలన పడేసిన వైనం
- పట్టించుకోని అధికారులు, నాయకులు

నరసాపురం రూరల్: గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే డిజిటల్ కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. ఎప్పటికప్పుడు రైతులకు కావాల్సిన సమాచారాన్ని కచ్చితత్వంతో అందించిన ఈ యంత్రాలు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో మూలన పడ్డాయి. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నరసాపురం మండలంలో 25, మొగల్తూరు మండలంలో 20 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు లక్షలాది రూపాయలను ఖర్చు చేసి కియోస్క్ యంత్రాలను గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రపరికరాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, సమీపంలోని మార్కెట్ వివరాలు తదితర అవసరమైన వివరాలన్నింటినీ ఈ డిజిటల్ కియోస్క్‌ల ద్వారా తెలుసుకునే వీలు ఉండేది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయశాఖ అన్ని విధాలా సేవలందించి వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్నా.. సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన ఈ కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మూలనపడ్డాయి.



తూర్పుతాళ్లు ఆర్‌ఎస్‌కేలో పనిచేయని కియోస్క్



వేములదీవి ఆర్‌ఎస్‌కెలో మూలనపడ్డ కియోస్క్

కూటమి ప్రభుత్వంలో పనికి రాని వైనం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు భరోసా కేంద్రాల పేర్లను హడావుడిగా రైతు సేవా కేంద్రాలుగా పాలకులు మార్చారు తప్ప అక్కడ లభిస్తున్న సేవలను మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోలేకపోయారు. దీంతో కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. అన్నిచోట్లా సాఫ్ట్‌వేర్ సమస్యతో ఈ యంత్రాలు పని చేయడం లేదు. కొన్ని చోట్ల వీటిని పూర్తిగా విస్మరించడంతో పూర్తిగా మూలన పడ్డాయి. కేవలం సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేసి, తాజా వివరాలను పొందుపరిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. చదువు రాని రైతు సైతం ఈ కేంద్రాలకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని సంప్రదిస్తే వారు ఈ యంత్రాల సాయంతో రైతుకు కావాల్సిన కచ్చితమైన సమాచారాన్ని అందిస్తారు. అలాంటి ఈ యంత్రాల వ్యవహారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని రైతులు పేర్కొంటున్నారు.

మొక్కుబడిగా సేవలు

రైతులకు గత ప్రభుత్వ హయాంలో ఎంగానో సేవలందించిన ఈ కియోస్క్‌లు ప్రస్తుతం మొక్కుబడిగా సేవలదిస్తున్నాయి. కియోస్క్‌ల విషయమై వ్యవసాయశాఖ అధికారులను వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా కొన్ని నెలలుగా ఈ యంత్రాలు పని చేయడం లేదని చెప్పారు. గతంలో ఈ యంత్రాలను ఏర్పాటు చేసిన నాటి సాంకేతిక నిపుణులు లేదా ప్రస్తుత ప్రభుత్వం నియమించే ఏజెన్సీ నుంచి సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తే వినియోగంలోకి వస్తాయని చెప్పడం గమనార్హం. అధునాతన సాంకేతికతతో కచ్చిత సేవలందించే ఈ కియోస్క్‌ల విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఊరూవాడా హనుమద్ జయంతి సందడి



యలమంచిలి: అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



పెనుమంట్ర: లక్షతమలపాకుల అలంకరణలో దాసాంజనేయస్వామి



యలమంచిలి: హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండ: సిద్ధాంతంలో ర్యాలీ చేస్తున్న హిందూ ధర్మపరిరక్షణ సమితి సభ్యులు

యలమంచిలి: హనుమజ్జయంతి సందర్భంగా గురువారం వాడవాడలా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడవిపాలెం, కొంతేరు, మేడపాడు, చించినాడ, ఏనుగువానిలంక, బాడవ, కలగంపూడి, దొడ్డిపట్ల, గుంపర్రు, అబ్బిరాజుపాలెం, కంచుస్తంభంపాలెం గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. యలమంచిలి మంచినీటి చెరువు గట్టున ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి వెంకట రాజ గోపాలకృష్ణమాచార్యులు (గోపి) స్వామికి పంచామృతాభిషేకం, ఏకాదశ మన్యసూక్తాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్ర నామార్చన చేశారు. ఆలయంలో చాంబర్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు చాగంటి లింగరాజు సుందరకాండ పారాయణ చేశారు. మేడపాడు మంచినీటి చెరువు గట్టున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన చేశారు. అలాగే విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించారు. చించినాడ బైపాస్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేసి ర్యాలీ ప్రారంభించారు. అక్కడ నుంచి యలమంచిలి, ఆర్యపేట, మేడపాడు, శిరగాలపల్లి, కట్టుపాలెం, ఇలపకుర్రు, గుంపర్రు, అబ్బిరాజుపాలెం మీదుగా దొడ్డిపట్ల సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో ఇటీవల ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలర్పించిన అగ్ని వీరుడు మురళీ నాయక్ చిత్రాన్ని పట్టుకుని ఆయనకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: స్థానిక గ్రామ పంచాయతీ చెరువుగట్టుపై ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ జయంతి, శ్రీపుంతలో ములసమ్మ అమ్మవారి ఆలయ 16వ వార్షిక తీర్థ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షులు కొవ్వూరి నాగరాజా మోహనరెడ్డి హేమ దంపతులు వేదపండితులు చిట్టా రవిశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం దాసాంజనేయునికి పంచామృతాభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ చేశారు. అలాగే పుంతలో ములసమ్మ అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చనలు చేశారు. వెలగలవారిపాలెం గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. నెగ్గిపూడి మాజీ సర్పంచ్ కర్రి అచ్యుతరామారెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

పెనుగొండలో..

పెనుగొండ: హనుమద్ జయంతి గురువారం పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హనుమంతుని ఆలయాలతో పాటు రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగొండ మండలం చిన్నం వారి పాలెంలో లక్షతమలపాలకులతో ఆంజనేయ స్వామిని అలంకరించి, సింధూర పూజలు నిర్వహించారు. సిద్ధాంతంలో హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, సభ్యులు ఏకరూప దుస్తులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పెనుగొండ, ఇలపర్రు, నడిపూడి, వడలి, సిద్ధాంతం, ములపర్రుల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచంట కాపుల పాలెంలోనూ, ఆచంట కచేరీ సెంటర్, పెనుమంచిలి, పెదమల్లం, కోడేరుల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: హనుమద్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో పలు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో రామాలయాలు కిటకిటలాడాయి. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద దాసోహంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని పండ్లు, తమలపాకులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే యడ్లబజారు సెంటర్ శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, కొత్తపేట, వెలమగూడెం ఆంజనేయస్వామి ఆలయం, వివిధ రామాలయాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అప్పాలు, వడలు, గారెలతో మాలలుగా తయారు చేసి అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నరసాపురంలో మొక్కల పెంపకం అధ్వానం

నరసాపురం: స్థానిక మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంతో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. దీంతో లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నెరవేరకుండా పోతుంది. కొన్నేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రభుత్వాలు ఏటా అట్టహాసంగా నిర్వహిస్తున్నాయి. పట్టణంలో పలు ధపాలుగా మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం అధికారులు గాలికి వదిలేశారు. అందువల్ల పట్టణంలో గోదావరి గట్టు, వైఎన్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. చాలా చోట్ల నీళ్ల పోయకపోవడంతో ఆ మొక్కలు చచ్చిపోయాయి. ఉన్న అరకొర మొక్కలు పశువులు తినేశాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌రోడ్డులో డివైడర్ల మధ్య ఎండిపోతున్న మొక్కలు

రక్తపోటు విషయంలో అప్రమత్తత అవసరం



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: గర్భిణుల్లో అధిక రక్తపోటు నమోదు కావడం వల్ల ప్రమాదకర లక్షణాలు కనబడతాయని అందువల్ల రక్తపోటు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) సుధాలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ అధ్యక్షతన గర్భిణులకు ప్రీ ఎక్లాంప్సియా (గుర్రపు వాతము) పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాలక్ష్మి మాట్లాడుతూ అధిక రక్తపోటు వల్ల ప్రసవ సమయంలో ప్రీ ఎక్లామ్సియా (గుర్రపు వాతము)కు గురవుతూ ఉంటారన్నారు. ఇది గర్భిణుల్లో 24 వారాలు తర్వాత వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, జిల్లా డీపీహెచ్‌ఎన్‌వో వెంకటరత్నం, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబెత్, స్వామి, సౌజన్య, అమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులపై దాడులు ప్రభుత్వ వైఫల్యమే

భీమవరం: బహుజనులపై దాడులు, అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన బహుజన సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన బహుజన సంకల్ప సభలు అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీ స్థాయిలో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, గుమ్మాపు చిత్రసేన, కార్యదర్శులు మురాల రత్నరాజు, ఏలూరి అశోక్, జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల ఏలియారాజు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో జీవ వైవిధ్య దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు అవ్వాలని కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జీవ వైవిధ్య దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ జీవ వైవిధ్యానికి సంబంధించిన కరెన్సీ నోట్లను, నాణేలు, పోస్టల్ స్టాంపులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీవ వైవిధ్యంపై వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.శాంతకుమారి, రీసోర్స్‌పర్సన్ కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. గురువారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ సుస్థిరత్వం ద్వారా జీవ వైవిధ్య చర్యను వేగవంతం చేయడం అనే అంశంపై నేషనల్ వెబినార్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అధ్యాపకులు ఎం.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో నాణేలు, నోట్లు, స్టాంపులు చూస్తున్న విద్యార్థులు

రోడ్డు భద్రతపై యాక్షన్ టీమ్ పరిశీలన

ఆకివీడు: రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన యాక్షన్ టీమ్ గురువారం స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద ప్రమాదాల నివారణకు పరిశీలన చేశారు. ఉప్పుటేరు నుంచి ఆకివీడు వైపు వచ్చే రహదారి మలుపు తీవ్రంగా ఉండటం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డు మలుపు నివారణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. జాతీయ రహదారి నంబర్ 165లో ప్రమాదాల నివారణకు ఆ శాఖ అధికారులు, స్థానిక ఎస్సై, ఆర్‌అండ్‌బీ అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక తెల్ల వంతెన దగ్గర నుంచి చెరుకువాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ రోడ్డు పలుచోట్ల ప్రమాద భరితంగా ఉందని, ఎత్తు పల్లాలతోనూ, గుంతలతో ఉందని ఆ ప్రాంతంలో రోడ్డు పునర్నిర్మాణం చేయాలని పలువురు యాక్షన్ టీమ్‌కు విజ్ఞప్తి చేశారు. యాక్షన్ టీమ్‌లో ఎస్సై హనుమంతు నాగరాజు, ఎన్‌హెచ్ డీఈ ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ డీఈ సీహెచ్ టీవీఎస్ ప్రసాద్, ఎన్‌హెచ్ సెక్షన్–2 ఏఈ సబీరా అహ్మద్, ఆర్‌అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుటేరు మలుపు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న భద్రత టీమ్ సభ్యులు

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

పాలకోడేరు: రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని, ఎండీయూ వాహనాలను రద్దు చేసి పాత పద్ధతిలో రేషన్ షాపుల వద్ద డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని డీలర్లు సక్రమంగా నెరవేర్చాలని తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మి అన్నారు. రేషన్ పంపిణీలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సోము సాయి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చినబాబు, సూరిబాబు, కిశోర్, కేవీబీఎల్ కుమారి, ఐ ఉషారాణి, ఎం.సుజాత, ఉన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుగొండ: ఆచంట మండలం పెనుమంచిలిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎం.వెంకట్రావును అరెస్ట్ చేసి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పాలకొల్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలో తనిఖీలు నిర్వహించామని వివరించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందజేత



పుష్పవతికి ఆర్థిక సాయం చేస్తున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు ప్రతి నెల చేస్తున్న పేదల సహాయార్థంలో భాగంగా మే నెలకు సంబంధించి గురువారం ఆచంట మండలం వల్లూరు పంచాయితీ చిల్లేవారిపాలెంనకు చెందిన చెల్లెం పుష్పవతికి రూ. 21,000 ఆర్థిక సహాయం చేశారు. పుష్పవతి గుండె వ్యాధితో ఆస్పత్రిలో ఉంటూ ఇబ్బందులు పడుతుందని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆమెకు వైద్య సహాయం నిమిత్తం ఈ నగదు వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సునీల్ గవాస్కర్, జీవీఎస్‌వీ ఆర్‌యం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు గోడ వెంకటేశులు, ఏనుగుపల్లి శేఖర్‌బాబు, తాడి రత్నంరాజు పాల్గొన్నారు.

గ్రామ దేవతల తీర్థ మహోత్సవం



ప్రత్యేకాలంకరణలో కోట్లమ్మ

పెనుగొండ: పెనుగొండ గ్రామ దేవతల తీర్థ మహోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి కోట్లమ్మ, మారేమ్మల దర్శనం ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల్లో ఉన్న గ్రామ ఆడపడుచులు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం వరకూ కోట్లమ్మ, మారేమ్మల ఆలయం కిటకిటలాడింది.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం

పెనుగొండ: వడలిలోని సాయినాథుని మందిర 8వ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సాయి అగస్త్యేశ్వర సేవా సమితి సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

కార్మిక హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడాలి



పర్స సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ కార్మికులు

పాలకొల్లు సెంట్రల్: పర్స సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. గురువారం పర్స సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భావం నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా సత్యనారాయణ సేవలను అందించారన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం జూలై 9న జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వీరవల్లి సత్యనారాయణ, కృపావరం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ నిత్యాన్నదాన పథకం పరిశీలన

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ దేవస్థానంలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించారు. వంటకాలను, రోజుకు ఎంత మందికి పెడుతున్నారు పరిశుభ్రత వంటి విషయాలపై ఈవో బుద్ధ మహాలక్ష్మీనగేష్‌తో మాట్లాడారు. అదే విధంగా దేవస్థానం ఎదురు రోడ్డులో ఎటువంటి భారీ వాహనాలకు అనుమతి లేకుండా చూడాలని, కేవలం ద్విచక్ర వాహనాలకే అనుమతి ఇచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డిని ఆదేశించారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.